

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 జూలై, 2013 సంచిక : 2

(విజయ నామ సం॥, ఆషాఢ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
నా కథ వినండి ........ 5
ఎన్ని నాట్యాలో-ఎన్నెన్ని ........ 11
షిరిడీ (కపర్దే) డైరీ ........ 13
శ్రీ సాయి సేవ ........ 15
సాయితో తర్ఖడ్ స్మృతులు-2 ........ 17
మాతృసంస్థ కబుర్లు ........ 21
గురుపూర్ణిమోత్సవం ........ 24
మౌనదీక్ష ........ 25
మంగళాశీస్సులు ........ 26
శ్రీ రమణ ఉవాచ ........ 27
అసలైన కవిత్వం ........ 29
కర్మలోని రహస్యం ........ 30







# మా వాణి



## ఆత్మ హితమాచరేత్

ప్రియ సాయిమిత్రులందరికీ గురుపూర్ణిమోత్సవ శుభాకాంక్షలు.

ఆషాఢం మొదలు ఆశ్వయుజం వరకు ఉన్న నాలుగు నెలలు చాతుర్మాస్య దీక్షకు నిర్దేశింపబడిన మాసాలు. మనకివి వానాకాలపు రోజులు గనుకనున్నూ, సాధు సంతులు పర్యటన చేయడానికి, ధర్మప్రచారానికి అనుకూలంగా ఉండవు గనుకనున్నూ యీ నాలుగు నెలలూ వారంతా తమతమ ఆశ్రమాలలోగానీ, ఏదైనా పుణ్యక్షేత్రాలలోగానీ స్థావరంగా ఉండి, స్వీయసాధన చేసుకొంటూ, చేరవచ్చిన భక్తులకు జ్ఞాన బోధ చేస్తూ ఉంటారు-ఉండాలి. ఆధ్యాత్మిక సాధన అన్నది ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవలసిన ఎడతెగని కార్యక్రమమే. మాన్యులు, పితృతుల్యులు స్వర్గీయ శ్రీ చోడవరపు సాంబమూర్తిగారు తమ కడపటిరోజులలో యీ రచయిత్రితోనే ఒకసారి అన్నారు - "బాబావారు నాకు బిందెలకొద్దీ శక్తి ప్రసాదించి గంగాళం నింపారే అమ్మా! ఆర్తితో వచ్చిన వాళ్ల కోసం చెంబులతో తోడిపోసాను. చూస్తూ చూస్తూ గంగాళం ఖాళీ అయిపోవచ్చింది. మళ్లీ ఆ శక్తి నింపుకుందామంటే సమయం ఏదీ! అయిపోయిందిగా!" వారు ఎంతో దీనస్వరంతో, తమ గుండెను పిండేస్తున్న బాధతో, చెమరించే కళ్లతో అన్న యీ మాటలు ఏ సాధకుడికైనా మార్గదర్శనం చేయగలవు.

మాయ నిరంతరం మనిషిని కమ్మేసే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. దానిని ఎదిరించే ప్రయత్నం కూడా సాధకుడు నిరంతరం చేస్తూనే ఉండాలి. వీడు ఆదమరచి ఉన్నాడా-పడిపోవడానికి క్షణం పట్టదు. ఆ

మాయను గెలిచేందుకు కావలసిన ఆత్మసాధన కోసమే యీ నాలుగు నెలలు ఇతర వ్యాపకాలన్నీ విడిచి, తమ శక్తిని (పరమాత్మతోడి అనుబంధాన్ని) తాము పెంచుకొంటూ ఉంటారు సాధుసత్పురుషులు. ఈ సమయంలో వారి లోపలి ధ్యానశక్తి ఏకాగ్రమై, మరింత తీవ్రమై ఉంటుంది. కనుక వారి నోట వచ్చే ప్రతి మాటా ఎంతో పవిత్రను పెంచుకొంటుంది. వారి దృష్టి పాతం కూడా భక్తులకు, శిష్యులకు ఎంతో మేలు చేస్తుంది. అందుకే కొందరు చింతనాపరులైన భక్తులు ఆ నాలుగు నెలలలో ఏవో కొద్ది రోజులైనా వారికి దగ్గరగా ఆయా దీక్షాస్థలాలలో ఉంటుంటారు.

(ఈ చాతుర్మాస్యపు రోజులు కేవలం సాధువులకేగాక హిందువు లందరికీ పవిత్ర దినాలే). మరి వీరు ఏమి చేసి లబ్ధిని పొందగలరు? లౌకిక సమస్యలు, గృహ కార్యాలు, ఉద్యోగాదులు-యివన్నీ విడిచి ఏకంగా నాలుగునెలలపాటు సాధనలో ఉండటం కుదరదు. మరి, అనేకానేకమంది సాధు, సన్యాసులు ఆసేతు హిమాచలం ఏకకాలంలో చేస్తున్న సాధనాశక్తితో పవిత్రమవుతున్న ఆ సమయపు విలువను గృహస్థులు పొందటం ఎలాగ? పెద్దలు నాలుగు మంచి ముక్కలు చెప్పారు ఎన్నో యుగాల క్రితమే. "సత్యం వద-ధర్మం చర-కాపట్యం న కుర్యాత్-ఆత్మహితమాచరేత్" అన్నవి ఆ అద్భుతోపదేశాలు. నిత్యజీవనంలో ఎన్నెన్నో దోషాలు, కపటాలు, కుతంత్రాలు, అధర్మకార్యాలు చేయక తప్పనిపరిస్థితులు సామాన్యుడికి ఎదురవుతూనే ఉంటాయి. ఎవ్వరికీ అలా చెయ్యాలని ఉండదు. కానీ సంసారలంపటంలో చిక్కుకొన్నాక కాళ్లకు బురద ఎలాగైనా అంటుతూనే ఉంటుంది. దాని పరిహారానికి యీ చాతుర్మాస్యదినాలను గృహస్థులు దీక్షాదినాలుగా తీసుకోవాలి. "సత్య వాక్కునే పలుకుతూ, కేవలం ధర్మాన్ని మాత్రమే ఆచరిస్తాను. ఇతరులను మోసగించే పనులు, మనసులో ఒకటి-మాటలో మరొకటి-చేతలో యింకొకటిగా ఉండక త్రికరణశుద్ధిగా జీవించే





ప్రయత్నం చేస్తాను. దానికి అనుగుణంగా ఉండే ప్రణాళికను తయారు చేసుకొని అలాగే నడుచుకొంటాను"-యిలా ఒక ప్రతిజ్ఞను తమకు తామే చేసుకోవచ్చును. సత్యం "వధ"కులోనై, ధర్మం "చెఱ" పట్టబడుతున్న వేళ యిలా బ్రతకడం కుదరదు-అని భావించేవారూ ఉంటారు. కానీ "ధర్మో రక్షతి రక్షితః' అన్నది గదా శాస్త్రం! ధర్మాన్ని మనం ఆచరిస్తే అది మనని కాపాడక ఎందుకు వదులుతుంది? కనుక ఆ భయం మనకు అక్కరలేదు.

పైగా-పై వాటిలో చివరిదేమిటి-"ఆత్మహితమాచరేత్" ఈ ముక్కకు చాలామంది పొరపాటు వ్యాఖ్యానం చెప్పకొని, తమకు అనుకూలంగా "నా ఆత్మకు ఏది నచ్చితే-ఏది హితవనిపిస్తే అదే చేస్తాను" "నాకేది ధర్మమనిపిస్తే అదే ఆచరిస్తాను" అని సెలవిస్తుంటారు. 'ఆత్మహితం' అంటే తనకు నచ్చినది అని అర్థం కాదు. ఆత్మయొక్క ఉన్నతికి ఏది మేలు(హితం) చేస్తుందో అది-అని అర్థం గ్రహించాలి. దీనిని శాస్త్రజ్ఞానాన్ని, గురువాక్యాన్ని ఆధారంగా తీసుకోవాలి. పైన మూడూ ఆజ్ఞారూపంలోనే- "సత్యం పలుకు, ధర్మం చెయ్యి, కపటం, కుతంత్రం చూపకు" అని చెప్పాక-చివరిదాన్ని "ఆత్మ హితం ఆచరేత్" అన్నది కూడా ఆజ్ఞగానే తీసుకోవాలి. పైగా అది ఆపై ఆజ్ఞలకు అనుకూలంగా ఉండే అర్థంలోనే గ్రహించాలి గదా! అందుచేత, ప్రియ సాధక మిత్రులారా, మనమందరం యీ దీక్షా దినాలలో మన ఆత్మోన్నత్యానికై పాటుపడదాం. ధర్మమార్గాన నడుస్తూనే-

బ్రాహ్మీ ముహూర్తంలో కనీసం (నాలుగు నుంచి ఐదు గంటల వరకు) ధ్యానం, జపం చేసుకుందాం. రోజుకో గంటైనా (కనీసం) స్వాధ్యాయం-అంటే సద్గ్రంథ పఠనం చేద్దాం. చేరువలోని ఆశ్రమానికో, సత్సంగ సమావేశానికో వెడుతూ, సాధు దర్శనం, సద్విషయ విచారణ చేస్తూ మనలోని ఆత్మశక్తిని పెంపొందించుకుందాం. అలా గురుదేవుల ద్వారా శ్రీ సాయిదేవులు మనను నడిపింతురు గాక!



# నా కథ వినండి

**- శుకవాణి**

"అబ్బ! కాళ్ళు నొప్పెడుతున్నాయిరా! ఇంక నేను ఆడను" అంది సుధీర. "నాకూనూ" అంది చైత్ర. "ఛీ! ఆడపిల్లలు మీరు. అందుకే నొప్పి. నాకు లేదుగా!" అన్నాడు మురళి వెక్కిరిస్తూ. "తంతాం వెధవా ఛీ ఆడపిల్లలమా! ఏం నీకేమైనా కొమ్ములున్నాయా?" అంటూ వెంటబడ్డారు చైత్రా, సుధీరా. వాడినెంత తరిమినా దొరకలేదు. 'సరే పోనీలే' అంది సుధీర. ఇద్దరూ బెంచీలు ఎక్కి కాళ్ల చాపుకొని కూర్చున్నారు. చైత్ర బల్లమీద తబలా వాయిస్తోంది. సుధీర వింటూ కూర్చున్నది. అలా రెండు మూడు నిముషాలు గడిచాయి.

"అబ్బ! ఆపమ్మా! ఎందుకలా కొడతావ్?" అని విన్పించింది. చైత్ర టక్‌మని ఆపేసింది. ఎవరామాటలన్నది? సుధీర గొంతు కాదది. "అక్కా ఎవరే?" అంది సుధీర. 'ఏమో' అన్నట్లు చెయ్యి ఊపింది చైత్ర. "నేనే మాట్లాడేది- మీరు కూర్చున్న బల్లను - అదే బెంచీని" మళ్ళీ వినిపించింది. చైత్రా, సుధీర హడలిపోయి లేచి పారిపోబోయారు. "ఆగండి" ఆజ్ఞాపించింది బెంచీ. "ఓ కథ చెప్పనా! మీకు కథలంటే యిష్టమేగా!" అంది బెంచీ మళ్ళీ. ఇద్దరూ అవునన్నట్లు గబగబ తలలూపారు. కానీ, యిద్దరి కళ్ళూ తీవ్రంగా వెదుకుతున్నాయి బెంచీకి నోరెక్కడా అని. "అలా కూర్చోండి ఫర్వాలేదు" అన్నది మళ్ళీ బెంచీ. ఇద్దరూ నేలమీద బాసింపట్లేసుకొని బుద్ధిగా కూర్చున్నారు. "ఇప్పుడు నా కథ చెప్తా వినండి" బెంచీ ప్రారంభించింది.

అదో చాలా పెద్ద అడవి. అందులోనే నేను పుట్టి పెరిగాను. నా కొమ్మలు విశాలంగా పరచుకొని ఉండేవి. నా మొదలు మీరు బార చాపి





అందుకున్నా ఓ ప్రక్కకూడా అందనంత పెద్దది. దానిలో ఒకటి పెద్దదీ, ఒకటి చిన్నదీ రెండు తొర్రలు కూడా ఉండేవి. ఒక తొర్రలో రెండు చిలకలూ, మరో దాంటో రెండు ఉడతలూ కాపురం చేసేవి. వాటికి పిల్లలు పుట్టినప్పుడల్లా నాకెంతో సంబరంగా ఉండేది. గిజిగాడు-అంటే బంగారు పిచ్చుక ఉందే! అది ఓ గూడు కట్టుకొన్నది. ఆ గూడు తలక్రిందులుగా ఓ ఉయ్యాలలాగా నా తూర్పు వైపు కొమ్మకు వేలాడుతూ గాలికి కదులుతూ ఉండేది ముచ్చటగా. నా కొమ్మల మీద కోతులు, కొండముచ్చులు, ఎన్నెన్నో పిట్టలు స్వేచ్ఛగా కూర్చునేవి. నా నీడలో పెద్దపెద్ద జంతువులు కూడా హాయిగా విశ్రాంతి తీసుకునేవి. బాటసారులు కూడా అప్పుడప్పుడూ వచ్చి కాస్త సేదదీరిపోయేవారు. వసంతఋతువులో నా ఒంటినిండా పసుపు పచ్చని పూలు గుత్తులుగుత్తులుగా విచ్చుకొనేవి. క్రిందికి రాలి పసుపు పట్టు పరుపులు పరిచినట్లు కన్పించేవి. ఎప్పుడైనా నాకు పురుగుపట్టినా వెంటనే నా మిత్రులు పిట్టలన్నీ - ముఖ్యంగా వడ్రంగి పిట్ట వాటినన్నింటినీ తినేసి నన్ను రక్షించేది. ఆ పిట్టలకెవరైనా వేటగాడు బాణం గురిపెడితే నేను గబగబా కొమ్మ ఊపేసి వాడి గురికి బలికాకుండా పిట్టలను కాపాడేదాన్ని. అలా ఒకరికొకరం తోడూనీడగా హాయిగా కాలం గడపుతుండేవాళ్లం. ఎప్పుడన్నా మీలాంటి చిన్న పిల్లలు నా దగ్గరకు వస్తే నాకెంతో సంతోషం వేసి వాళ్ల తలల మీద పూలు రాల్చేదాన్ని. పండిన పళ్లు వాళ్ల ముందు పడేలా చేసేదాన్ని. వాళ్లు కిలకిల నవ్వుతుంటే నాకు చక్కిలిగిలి పెడుతున్నట్లు సరదాగా ఉండేది.

అలాంటి బంగారుకాలంలోకి కాలయముళ్లు వచ్చిపడ్డారు. ఏమేమిటో యంత్రాలు తెచ్చారు. మర రంపాలట-వాటి పళ్లూ అవీ - చూస్తేనే భయం వేసేది. వాళ్లు వచ్చీరాగానే రెండు మూడు గుడ్డ గుడిసెలు-గుడారాలంటారట వాటిని - వేసుకున్నారు. ఇక మరునాటి నుంచీ ..... ఏం చెప్పమంటారు

తల్లీ! మా మిత్రులు ఒక్కొక్కళ్లనీ నిలువునా నరికి నాశనం చెయ్యటం మొదలుపెట్టారు. కొందరు వెధవలైతే చక్కని చిలకలనూ, పావురాలనూ పట్టుకొని చంపి తినటం ప్రారంభించారు. కోతులు గోలచేస్తూ ఎటో వెళ్లిపోయాయి. "వీళ్లను ఏం సింహమైనా వచ్చి మింగితే పీడ వదులుతుంది" అనుకొని రోజూ దేవుడికి దండం పెట్టుకొనేదాన్ని. ఏ దేవుడూ నా మొర వినలేదు. చివరికి నా వంతు రానే వచ్చింది. నా మొదలు కొయ్యటం మొదలుపెట్టారు. ఆ బాధ గుర్తు వస్తే యిప్పటికీ నాకు కన్నీళ్లు వస్తాయి. ఆ రంపం పళ్లు నా మొదలులో లోపలికంటాపోయి ... అబ్బ! ఎంత హింసో!" ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత మళ్లీ కథ కొనసాగింది.

'నా మీది పక్షులన్నీ పాపం చెల్లాచెదురైపోయాయి. ఆకాశంలోకి తలెగరేసినంత ఠీవిగా నిలబడిన నేను ఒక్కసారిగా బిళ్లబీటుగా నేలకు ఒరిగిపోయాను. ఈసారి గొడ్డళ్లు, చిన్న రంపాలు రకరకాల విన్యాసాలు చేసాయి నా మీద. పక్షికి రెక్కలు నరికినట్లు నా పెద్ద కొమ్మలన్నీ కొట్టేసారు. నేను మొండిగా మిగిలాను. ఒక వారం తరువాత పెద్ద పెద్ద లారీలు వచ్చాయి. నన్నూ, నా మిత్రులనూ లారీలకు ఎక్కించారు. ఆ పచ్చని అడవి నుంచీ - నా పుట్టింటి నుంచీ - ఎక్కడెక్కడికి తరలించుకుపోయారో నాకు తెలియదు. మాటిమాటికీ వెనక్కు వెనక్కు తిరిగి చూస్తూ, వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూ ఎంత దూరం వెళ్లామో! కలప అడితీ అంటారట దాన్ని-అక్కడ పడేసారు మమ్మల్ని.

ఓ రెండు నెలలపాటు అలాగే ఉఆన్నం. ఒకరోజు నన్ను మళ్లీ ముక్కల క్రింద కోసేసారు. ఆ తరువాత పలకలు పలకలుగా మిషన్ మీద కోసారు అడవిలో. కెవ్వుకెవ్వుమని ఏడ్చిన్నాడే ఎవరూ వినలేదు. ఏడ్చి లాభమేముంది? భరించాను నిశ్శబ్దంగా. మరో రెండు నెలలు గడిచిపోయాయి. ఎవరో ఒకాయన పడవంత కారులో వచ్చి నా





పలకలను పరిశీలించి చూచుకున్నాడు. ఏవో బేరాలూ అవీ సాగాయి. అంతే నా మకాం ఫర్నిచర్ వర్కషాపట-అక్కడికి మారింది. ఇక అక్కడి కథ చెప్పాలంటే మీరు భయపడతారు. మమ్మల్ని నేనుపు చేయటానికి చిత్రిక పట్టారు. ఎప్పడన్నా ఎదురుదెబ్బ తగిలి మీ వేలి చెక్కు ఎగిరిపోతేనే మీరు అల్లాడిపోతారే-అలాంటిది మమ్మల్ని బాడిసెలతో, ఉలులతో ఇష్టం వచ్చినట్లు చెక్కిపోస్తే ఎలా ఉంటుందో ఊహించండి. భరించాను-ఏం చేస్తాను!

మమ్మల్ని బెంచీలుగా తయారుచెయ్యటాఇకి పని మొదలుపెట్టారు. మానెత్తిన ఇష్టం వచ్చినట్లు మేకులు కొట్టారు. కాళ్ళు దిగ్గొట్టారు. చివరికి పాలిష్ పులిమారు. ఎందుకూ-మా గాయాలు మాకు కనపడకుండా ఉండటానికి. నాలాంటి వాళ్లనే-అంటే బెంచీలనే ఓ వంద తయారుచేసారు ఆ వర్క్‌షాపులో. ఒకరినొకరు ఓదార్చుకొంటూ, ఈ మనుష్యులనబడే వాళ్లను దేవుడు ఇంత ఛండాలంగా ఎందుకు పుట్టించి ఉంటాడో ఊహిస్తూ ఓ ప్రక్కనపడి ఉన్నాం కొన్నాళ్లు. ఇంతలో వేసవికాలం అయిపోయింది.

ఓ రోజు-నాకు బాగా గుర్తు - సన్నగా తొలకరి జల్లు పడుతోంది. మమ్మల్నందర్నీ లారీలలోకి ఎక్కించారు. ఆవరణ దాటి బయటకు రాగానే విశాలమైన ఆకాశం కన్పించింది. వీధుల ప్రక్కన అక్కడక్కడా చెట్లు కన్పించాయి. చినుకులకు తడిసిన మట్టి కమ్మని వాసనలు వెదజిమ్ముతోంది. నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. లారీలు వచ్చివచ్చి యిక్కడ ఆగాయి. మమ్మల్నందరినీ దింపి ఒక్కో గదిలో కొందరిని సర్దారు. ఆ తరువాత అన్ని గదులకూ తాళాలు వేసేసారు. గాలీ, వెలుతూరు లేని ఆ గదుల్లో బిక్కు బిక్కుమంటూ పదిరోజులు గడిపాం. ఒకనాడు అన్నింటి తాళాలూ తీసారు. మమ్మల్నందరినీ గుడ్డలతో శుభ్రంగా దులిపారు. అంతలో

బిలబిలా పిల్లలంతా వచ్చేసారు. అప్పుడర్థమైంది నాకు ఇది ఒక పాఠశాల అని.

నిజ్జంగా చెప్తున్నా - మీ మధ్యలో ఉంటే నాకెంతో ఆనందం కలుగుతుంది. మీరు నా మీద కూర్చొని శ్రద్ధగా గురువులు చెప్పేవి వింటోంటే "ఎందరు సరస్వతీ దేవులో!" అనుకుంటాను. మీరు కిలకిలా నవ్వినప్పడల్లా అడవిలో నా కొమ్మల్లో ఆడుకొంటుంటే వినబడిన పక్షిపిల్లల కూతలే గుర్తు వస్తాయి. ఆకుపచ్చ చొక్కాల్లో, ఎర్రని నిక్కర్లలో, పరికిణీలలో మిమ్మల్ని చూచినప్ప డల్లా ఎర్రని పూలతో నిండిన పచ్చని చెట్లు చూచి నట్లుంటుంది. ఒక్కోసారి మీరు ఏవో ఉత్సవాలు చేసుకొనేటప్పడు-మమ్మల్నందరినీ పక్కపక్కన చేర్చి వేదికలా ఏర్పాటు చేసుకుంటారు. మీ చిన్ని చిన్ని పాదాలకు మువ్వలు కట్టుకొని మీరు దానిమీద నాట్యం చేస్తోంటే నేను వాటిని తడిమి ముద్దు పెట్టుకొంటుంటాను. ఒక్కరోజు ఏ పిల్లవాడైనా రాకపోతే వాడేడీ అని అడుగుతాను. కానీ నా భాష మీకు రాదుగా! మీరు ఆటల్లో ఎప్పడైనా పడిపోతే-మీరు తప్ప చేసినప్పడు మీ టీచర్లు మిమ్మల్ని కొడితే నాకెంత ఏడుపొస్తుందో. చెప్పలేను. మీకు సెలవులిస్తే మీరు కనపడరని నాకు దిగులు.

ఎన్నో కష్టాలు పడీ పడీ యిక్కడికి వచ్చాను. ఈ చిట్టిపొట్టి పిల్లలను మీద కూర్చోబెట్టుకొంటూ, వీళ్ల జిలిబిలి మాటలు వింటూ యిలా హాయిగా ఉండిపోతే చాలుననుకొన్నాను. కానీ ...." ఓ రెండు క్షణాలు నిశ్శబ్దం.... తరువాత బాధతో బొంగురుపోయిన కంఠంతో మళ్లీ కథ మొదలైంది.

"కానీ ... కానీ ... మీరు మమ్మల్ని ప్రేమించరు. ఇటూ అటూ లాగి పడేస్తారు. అప్పడు మాకు దెబ్బలు తగులుతాయేమో-కాళ్లు విరుగుతాయేమో అనుకోరు. ఒక్కోసారి మా మీదుగా ఎగిరెగిరి దూకుతూ పరుగులు తీస్తారు. ఓ ప్రక్క నా నడుము విరుగుతుందేమోనని భయం,





మీరు పడిపోతారేమోనన్న భయం కలిసి వణికిపోతాను. ఒకవేళ నా నడుము విరిగిపోయిందే అనుకోండి - ఏం చేస్తారు? పాత సామాన్ల గదిలో పారేస్తారు. అటుపైన పొయ్యిలో పెట్టేస్తారు. అప్పడు మీరెవ్వరూ నాకు కనపడరుగా - అదీ నా బాధ. అన్నిటికన్నా నాకు దుఃఖం ఎప్పడు వస్తుందో తెలుసా! మీలో కొందరు పిల్లలు కంపాస్‌బాక్స్‌లోని డివైడర్‌తోనో, వృత్తలేఖిని తోనో, బ్లేడుతోనో నా మీద పేర్లు చెక్కుతుంటారు. నాకు చాలాకోపం వస్తుంది అప్పడు. ఎందుకో తెలుసా? నేను స్కూలు సొమ్మును. మీ యింటి సొత్తును కాను. ఇవ్వాళ స్కూలు వస్తువు మీద మీరు వ్రాసుకొనే వాళ్లు - రేపు దేశసంపద మొత్తం మీదే ననుకుంటారేమో అన్న భావంతో కోపం వస్తుంది. ఈ సంవత్సరం మీరు మీ పేర్లు చెక్కుతారు. వచ్చే ఏడు మరికొందరు. ఆపై ఏడు ......... ఇలా చెక్కుతూపోతే మా ఒంటినిండా ఎన్ని గాయాలు! సిలువ మీది ఏసుక్రీస్తుకులాగా ఒళ్లంతా గుచ్చుతారా మమ్మల్ని. ఇది ధర్మమేనా? మేము మీ వాళ్లమే. మా మీద మీకు జాలి వెయ్యటం లేదూ! వద్దమ్మా, మమ్మల్నిలా హింస పెట్టకండమ్మా! వద్దమ్మా-ప్లీజ్- వద్దమ్మా!" కథ అగిపోయింది.

"ఏం చేస్తున్నారే యిక్కడ?" అంటూ వచ్చాడు పెద్దన్నయ్య. "ఏడవకు బెంచమ్మా! ఇంకెప్పడూ నీ మీద ఎగరను-బరబరా లాగను. బ్లేడుతో గియ్యను. ఒట్టు తల్లితోడు" సుధీర కలవరిస్తోంది పెద్దగా. పెద్దన్నయ్య దాన్ని తట్టి లేపాడు. సుధీర లేచి నిలబడింది. చైత్ర కూడా లేచింది. సుధీర బెంచీని చాలా ఆప్యాయంగా తడుముతూ "చైత్రా బెంచీ పాపం చాలా మంచిది. కదూ!" అన్నది. పెద్దన్నయ్య, చైత్ర నవ్వారు. "అవునమ్మా!" అంటూ-సుధీర ఎందుకలా అందో తెలియకపోయినా.

# ఎన్ని నాట్యాలో-ఎన్నెన్ని భంగిమలో!

- మాతాజీ

సూరదాసు జన్మతః అంధుడు. కానీ ఏ పూర్వజన్మ మహద్భాగ్యమో- అతనికి అద్భుతమైన కృష్ణ భక్తి అలవడింది. కృష్ణ నామం వినపడితే చాలు పరవశించిపోయేవాడు. ఆయన ఆరాధ్యమూర్తి బాలకృష్ణుడు. నాట్యం చేసే చిన్నికృష్ణుని సౌందర్యప్రభ చూడడానికి కళ్లు లేకపోయినా - మనో నేత్రంతోనే చూడగలిగేవాడు. ఆయన ప్రపంచమంతా కృష్ణుడే.

ఒకసారి సూరదాసు బృందావనం చూడాలని బయలుదేరాడు. కానీ అంధత్వం వలన ప్రయాణం చాలా యిబ్బంది. పైగా దారి తెలియదు కూడా. అయినా ముందు వెళ్లే వాళ్ల మాటల సవ్వడిని బట్టి ఊహించు కొంటూ, తడబడుతూ వెడుతున్నాడు. కొంతదూరం వెళ్లాక మిగిలిన వారికన్నా బాగా వెనకబడిపోయాడు. "కృష్ణా, దారి చూపవయ్యా" అని పాడుకొంటూ మెల్లమెల్లగా సాగిపోతున్న సూరదాసును ఒక చిన్న అబ్బాయి పలకరించాడు- "ఎక్కడికి వెళ్లాలి తాతా!" అంటూ. "బృందావనానికి బాబూ!" సూరదాసు మాట విని దగ్గరగా వచ్చిన ఆ అబ్బాయి "నేను నీకు దారి చూపిస్తాను తాతా! మాది ఆ ఊరేలే!" అని సూరదాసు చేతిలోని కర్రకు రెండవవైపు పట్టుకొని ముందు నడవసాగాడు. సూరదాసు కృష్ణ కథలు చెప్తున్నాడు. పిల్లవాడు మధ్య మధ్య ప్రశ్నలు వేస్తుంటే సందేహాలు తీరుస్తున్నాడు. తనతోపాటు అతన్ని కూడా కృష్ణ సంకీర్తనం చెయ్య మంటున్నాడు. అలా ప్రయాణం సాగిసాగి బృందావనం చేరువకు వచ్చారు.

"తాతా, అదుగో, బృందావనం కన్పిస్తున్నది. ఒక్క గడియలో అక్కడికి చేరుకుంటావు. మరి నేను వెడతానేం?" అన్నాడు అబ్బాయి.

"బాబూ! నీ వెనక నడుస్తోంటే నాకు అలసటే తెలియలేదు. నా కన్నయ్య గురించిన కథలన్నీ అడిగి తెలుసుకున్నావు- నీవు కూడా భక్తుడిలాగే ఉన్నావు. నన్ను వదిలిపెట్టి వెళ్లకు నాయనా!" అన్నాడు సూరదాసు.

"కాదులే తాతా, నాకు వేరే పనుంది" అంటూ పిల్లవాడు కర్ర వదిలేసాడు.





"నాయనా, వెళ్లకు బాబూ! నీ మీది నుండీ వచ్చే పరిమళం, నీ కంఠంలోని మాధుర్యం నా కన్నయ్యనే గుర్తు చేస్తున్నాయి. నన్ను వదిలి వెళ్లిపోకు" అంటూ సూరదాసు ఆ కుర్రవాడి చెయ్యి పట్టుకొన్నాడు. అతడు చటుక్కున చెయ్యి విడిపించుకొని మాయమైపోయాడు. ఆ స్పర్శతోనే సూరదాసుకు అర్థమైంది - ఆ బాలుడు తన బాలకృష్ణుడేనని. "కళ్లు లేవని నన్నింత మాయ చేస్తావా కన్నయ్యా!" అని ఏడుస్తూ ఎంతో చక్కని కీర్తన పాడుకొంటూ బృందావనానికి చేరుకొన్నాడు.

చాలాకాలం గడిచిపోయింది. సూరదాసు తన మనోనేత్రంతో దర్శిస్తున్న కృష్ణలీలలన్నీ కీర్తిస్తూ దేశమంతా తిరిగాడు. ఆయన సంకీర్తనం వలన ఎందరో కృష్ణభక్తులయ్యారు. ఇప్పుడు సూరదాసు చాలా వృద్ధుడై పోయాడు. అయినా ఆయన సంకీర్తనం మానలేదు. సూరదాసు పెదవి మెదపగానే కృష్ణయ్య కాలి మువ్వలు ఘల్లుమంటాయి. ఈయన పాడు తున్నంతసేపూ ఆయన నాట్యం చేస్తూనే ఉంటాడు. అది ఎంతోకాలం దశాబ్దాల తరబడీ సాగింది. ఒకరోజు కృష్ణుడన్నాడు-"సూరదాసూ ఎన్నాళ్లని యిలా నన్ను ఆడమంటావు? నాట్యం చేసి చేసి నా కాళ్లు నొప్పిపెడు తున్నాయి. ఇక - నేను పాడతాను. నీవు నాట్యం చెయ్యి. ఏమేమి భంగిమలు చూపిస్తావో చూస్తాను".

సూరదాసు ఫక్కున నవ్వాడు. "కన్నయ్యా! నా నాట్యం నీవు చాలాసార్లు చూచావు. ఎనభై లక్షల రూపాలలో పుట్టి ఎన్నెన్ని రూపాలతో, ఎన్ని ఆహార్యాలతో, అలంకారాలతో, ఎన్ని నాదాలతో, ఎన్ని భంగిమలతో నాట్యం చేసానో నువ్వు చూడలేదూ! అందుకనేగా యీ సర్వశ్రేష్ఠమైన మానవ జన్మలో నీ నామం పలకగలశక్తీ, నీ రూపం మనసా చూడగల శక్తీ ప్రసాదిం చావు. అన్ని లక్షల రూపాల నాట్యం చేసిచేసి యిలా వృద్ధుడినై పోయాను. ఇకనైనా నా నటనను ఆపి, విశ్రాంతి నివ్వరాదటయ్యా!" అన్నాడు సూర దాసు గద్గదమవుతున్న కంఠంతో. కృష్ణుడు చేయి చాపి సూరదాసును స్పృశించాడు. సూరదాసు జన్మ ముగిసింది. ఆత్మ తరించింది. కృష్ణునిలో ఐక్యమైపోయింది. ఇప్పుడు మనం చేస్తున్న అభినయాలు, భంగిమలు భగవత్పరమైపోతేనే గదా - మనకూ విముక్తి కలిగేది! ఎన్నటికో మరి!



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్డే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

**09-12-1911**

నేను నిద్రలేచి ప్రార్థన పూర్తి చేసుకునేటప్పటికే కొంచెం ఆలస్యమైంది. ఒక నౌకరును వెంటబెట్టుకొని చందోర్కర్ వచ్చాడు. ఇంకా చాలామందే వచ్చారు. ఇక్కడున్న వాళ్ళు కొందరు వెళ్ళిపోయారు. చందోర్కర్ నిరాడంబరుడైన మంచి మనిషి. సంభాషణాచతురుడు. తన చర్యలలో సాదా మనిషి. నేను మసీదుకు వెళ్ళి అక్కడి విషయాలు వింటూ చాలాసేపు కూర్చున్నాను. సాయి మహరాజు మంచి ఉల్లాసంగా ఉన్నారు. నా దగ్గర నుండి హుక్కా తీసుకొని ఒక పీలుపు పీల్చారు కూడా. ఆ రోజు హారతి వేళలో ఆయన చాలా అద్భుత సుందరంగా కనిపించారు. కానీ ఆ తరువాత అందర్నీ తొందరగా పంపించి వేశారు. నా దగ్గరకు భోజనానికి వస్తానని చెప్పారు. ఆయన నా భార్యను "ఆజీ బాయ్" అని పిలుస్తారు. మా వాడాకు తిరిగి వస్తుంటే జబ్బుగా ఉన్న దీక్షిత్ కూతురు మరణించిందని తెలిసింది. కొన్నాళ్ళ క్రితం ఆ అమ్మాయికి సాయిమహరాజ్ తనను ఇక్కడ వేపచెట్టు క్రింద ఉంచినట్లు కల వచ్చింది. సాయిమహరాజ్ కూడా పిల్ల చచ్చిపోతుందని చెప్పారు నిన్ననే. మేము యీ విషాద సంఘటన గురించి మాట్లాడుకుంటూ కూర్చున్నాము. ఆ పాప వయస్సు ఏడేళ్ళే. నేను ఆమె శవాన్ని చూడటానికి వెళ్ళాను. చాలా అందంగా ఉంది. మృత్యువు తరువాత కూడా ఆమె ముఖంపైన కళ విచిత్ర సౌందర్యంతో నిండి ఉంది. అది నాకు ఇంగ్లండులో నేను చూచిన మడోనా బొమ్మను గుర్తు చేసింది. శవఖననం మా





వాడా వెనుకనే జరిగింది. ఈ శవయాత్రలో పాల్గొనడం చేత సాయంత్రం నాలుగైనా నేను ఏమీ తినలేదు. దీక్షిత్ ఆ దెబ్బను అద్భుతమైన స్థాయిలో సహించారు. అతని భార్య సహజంగానే పట్టరాని దుఃఖంతో బావురుమన్నది. అందరూ ఆమె పట్ల సానుభూతి చూపించారు. ఆ సాయంత్రం చావడికి వెళ్ళి సాయి మహరాజ్‌ను దర్శించుకున్నాం. శేజారతి సమ యంలో కూడా దర్శించుకున్నాను. ఆ రాత్రి నేనూ, మాధవరావ్ దేశ్‌పాండే, భీష్మ తది తరులు కలిసి కూర్చొని సాయి మహరాజ్ గురించే మాట్లాడుకున్నాం. తోసర్ ఇంటికి వెళ్ళడానికి సాయి మహరాజ్ దగ్గర అనుమతి తీసుకున్నాడు. అతను రేపు ప్రొద్దున్న వెళతాడు.

**10-12-1911**

నేను ఉదయం నా ప్రార్థనలింకా ముగించకముందే బొంబాయిలో సోలిసిటర్‌గా ఉన్న దత్తాత్రేయ చిట్నీస్ వచ్చారు. నేను కాలేజీలో ఫెలోషిప్‌లో ఉన్నప్పుడు అతను క్రొత్తగా అక్కడ చేరాడు. అంచేత నాకు చాలాచాలా పాత మిత్రుడు. సహజంగానే అతను ఆ పాత విషయాలన్నీ మాట్లాడాడు. నేను మామూలు ప్రకారమే సాయి మహరాజు బయటికి వెళ్లేటప్పుడూ, తిరిగి వచ్చి ఆయన తన మామూలుచోట్లో కూర్చున్నపుడూ కూడా దర్శనం చేసుకున్నాను. హారతి తరువాత తిరిగి వచ్చాను. అల్పాహారం కాస్త ఆలస్యమైంది. ఆపైన నేను ఉపాసనీ, చందో ర్కర్‌లతో మాట్లాడుతూ కూర్చున్నాను. నానాసాహెబ్ చందో ర్కర్ సాయి మహరాజ్‌కు బాగా పాత భక్తుడు కాకపోయినాగానీ - ముఖ్యుడు. చాలా ప్రసన్నమైన మనిషి. ఆయన సాయి మహరాజ్‌కు సన్నిహితంగా ఎలా వచ్చిందీ, ఎలా అభివృద్ధి చెందు తున్నదీ తన కథంతా చెప్పాడు. తాను పొందిన ఉపదేశాలు కూడా చెప్పబోయాడు గానీ, అందరూ వచ్చేసారు. అందరి ముందూ అతనవి చెప్పలేదు. ఆ సాయంత్రం సాయి మహరాజు దర్శనం చేసుకోవాలని

నేను రెండు సార్లు ప్రయత్నం చేసాను గానీ-వారు ఎవ్వరినీ చూచే మూడ్‌లో లేరు. సాయంత్రం చావడి దగ్గర దర్శించుకోగలిగాను. సాఠే సాహెబ్‌తోనూ, చిట్నీస్‌తో, తదితరులతో చాలాసేపు మాట్లాడాను. నర్సోబా వాడీ నుండీ గోఖలే అనే ఆయన వచ్చి ఉన్నాడు. ఆయన తనను ఖేడ్‌గాంవ్‌కు చెందిన నారాయణ మహరాజు సాయి దర్శనానికి పంపాడని చెప్పాడు. అతను చక్కగా పాడుతాడు. రాత్రి కొన్ని భజనలు పాడించుకున్నాము. ఇవ్వేళే నానాసాహెబ్ ఠాణాకు తిరిగి వెళ్లిపోయాడు. కొద్దిరోజుల క్రితం బాలాసాహెబ్ భాటేకు పుట్టిన బిడ్డ యివ్వేళ మరణించాడు. ఇది చాలా విచారకరమైన సంగతి. ఇవ్వేళ సాయంత్రం సాయి మహరాజు ఒక మందు తయారుచేసి తామే తాగారు.

**(సశేషం)**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

ఈ రంగంలో యింకో చమత్కారం కూడా ఉంది. ప్రపంచమంతా లాభ దృష్టితో బ్రతుకుతున్నప్పుడు మీరు నిష్కామంగా చేస్తున్నారన్నా ఎవరూ నమ్మరు. ఏదో ఉండే ఉంటుందిలే అన్నట్లు చూస్తారు. ప్రారంభంలో ఒళ్లు మండుతుంది. మనసు చివుక్కుమంటుంది. కానీ క్రమక్రమంగా అలవాటై పోతుంది.

మేము మెడికల్ క్యాంప్‌లో మందులు సప్లై చేసినప్పుడు కొందరు డాక్టరు చెప్పిన వాటికన్నా ఎక్కువ అడిగేవారు. ఇంకొందరు కాల్షియం, ఐరన్‌లాంటి మందులు ఊరికే అడిగేస్తుండేవారు జబ్బుతో నిమిత్తం లేకుండా. "అమ్మా, మేమివి డబ్బు పెట్టి కొని తెస్తున్నాము. అలా వృథాగా





ఎన్నంటే అన్ని యివ్వడానికి వీల్లేదు. మీకు ఎవి ఎంత అవసరమని డాక్టర్లు చెప్తే అన్నే యిస్తాము" అన్నాం మేము.

అప్పుడొకాయన "ఊరికే యిస్తున్నారా ఏంది? సర్కారోళ్లు మీకంత యిస్తున్నారేమో ... మీరింత తిని మాకింత యిస్తున్నరు" అనేసాడు.

కేవలం సేవాభావంతో చేసేపని మీద యిలా బురద చల్లటం అన్నది వాళ్ల అవివేకమే కాదు - అలాటి పనులు చేస్తూ చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్న వాళ్లను చూస్తున్నారు వాళ్లు ప్రతిరోజూ. ఆ అనుభవజ్ఞానం వాళ్లది మరి! మాకూ, సర్కారుకీ ఏ సంబంధం లేదని వాళ్లకు అర్థం కావటానికి ఐదేళ్ళు పట్టింది. ఇది ఒక వైపు.

మరోవైపు -

ఏవో కొన్ని సంవత్సరాలు పనిచేస్తాం. శారీరకశక్తి నశించో, ఆర్థిక వనరులు సమకూడకనో, మరే యితర కారణాలచేతనో మానేస్తాం. (సాధారణంగా సేవా సంస్థలకైతే యీ యితర కారణాలతో ముఖ్యమైనది సరైన కార్యకర్తలు దొరక్కపోవడం అన్నదే. మరో ముఖ్యకారణం ప్రారంభించిన వారికి ఉన్నంత తపన, శ్రద్ధ తరువాతి వారిలో తగ్గటం కూడా అవుతుంటుంది.) వ్యక్తిగతమైన కారణాల వలన కొందరు మానేస్తారు.

చేసినన్నాళ్ళూ ఎవ్వరూ తోడు రారు. కొన్నిసార్లు రాళ్ళు విసురుతారు కూడా. ఆపెయ్యగానే మాత్రం యిదే మనుషులు తమ విమర్శనాస్త్రాలను మరో ధోరణిలో మరో రూట్లో ప్రయోగించటానికి సిద్ధపడతారు. మనకేదో ఒక సామెతుంది గదా-"పెట్టని తల్లి పెట్టనే పెట్టదు, పెట్టే ముండకేం వచ్చింది పెద్దరోగం!" అన్నాడట వెనకటికి భిక్షగాడెవరో. అదిగో ఆ పద్ధతిలోనే యీ పెద్దమనుషులంతా 'ఏమైందో మరి' అనేస్తారు వ్యంగ్యంగా.

ఇవన్నీ సేవారంగంలోకి రాబోయేవారికి భయపెట్టడానికి చెప్పటం లేదు సుమా! ఖచ్చితంగా విజ్ఞత, సాయిభక్తి ఉన్న ప్రతివాడూ సేవారంగంలోకి రావలసిందే. పనిచేసి తీరవలసిందే. అంతేకాక యివన్నీ ఎదుర్కోవడానికి, స్వీకరించడానికి తగినంత మనోబలాన్ని చేకూర్చుకొని మరీ సంసిద్ధులు కావాలని చెప్పడానికే యీ వివరణంతా.

**(సశేషం)**

# సాయితో తర్ఖడ్ స్మృతులు - 2

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

సాయిబాబాతో అటువంటి అద్భుతమయిన పరిచయం కలిగిన అనుభూతితో తల్లీకొడుకులిద్దరూ కూడ వెంటనే ఇంటికి తిరిగివచ్చి, మా తాతగారితో జరిగినదంతా ఎప్పుడు చెబుదామా అని చాలా ఆత్రుతతో ఉన్నారు. ఏమయినా సాయిబాబా మరికొద్ది రోజులు షిరిడీలో ఉండమని సూచించారు. వారు అందుకు వారి కోరికను మన్నించారు. భక్తులకి సహాయపడుతూ- వారికి మార్గదర్శకులు సాయిబాబాతో సన్నిహితంగా ఉన్నటువంటి మాధవరావు దేశ్‌పాండేగారితో వారు చర్చలు జరిపారు. ఉదయం బాబాగారు యెవరికోసమో ఎదురుచూస్తున్నారనీ, తన తల్లి సోదరుడు తనని కలుసుకోవడానికి వస్తున్నట్లుగా చెప్పారనీ మాధవరావు దేశ్‌పాండేగారు చెప్పారు.

భక్తులందరూ సామాన్యంగా బాబాగారి అనుమతి తీసుకున్న తరువాతే షిరిడీ వదిలివెడతారని మాధవరావుగారు చెప్పారు. అప్పుడు వారు బాంద్రాలో ఉన్న బాబాసాహెబ్‌గారికి, తాము అనిర్వచనీయమైన, అద్భుతమైన అనుభూతిని పొందామనీ, అందుచేత షిరిడీలో యింకా ఉంటామనీ ఒక ఉత్తరం వ్రాశారు. అలా వారు షిరిడీలో వారం రోజులు ఉన్నారు.

తరువాత వారు బాబా వద్ద అనుమతి తీసుకుని మరలా బాబాసాహెబ్ గారితో తిరిగి వస్తామని మాట ఇచ్చి, వారి స్వస్థలమైన బాంద్రాకు తిరిగి వచ్చారు. వారు ఉన్న ఆ వారంరోజుల కాలంలో మిగతా సాయిభక్తులైన 'శ్రీమహల్సాపతి', కాకాసాహెబ్ మహాజని, శ్యామారావు జయకర్ మొదలైన వారినందరినీ కలుసుకున్నారు. వారు మొత్తం విషయమంతా మా తాతగారికి తెలియజెప్పి షిరిడీలోని శ్రీ సాయిబాబా మామూలు వ్యక్తి కాదని





ఒప్పించే ప్రయత్నం చేశారు. ఆయన మంచి మందులు ఇవ్వడమే కాదు, ఆయనలో అతీతమైన శక్తులు కూడ ఉన్నాయని చెప్పారు.

మా తాతగారు మా నాన్నమ్మగారి మనోభావాలని తేలికగా తెలుసు కున్నారు. కాని వీటినే మా నాన్నగారి నుంచి విని కొంచెం ఆశ్చర్యపోయారు. ఆయనకు తాము మరల తరువాత షిరిడీ వచ్చేటప్పుడు బాబాసాహెబ్‌తో వస్తామని చెప్పినట్లుగా కూడ తెలియజేశారు.

ప్రియమైన పాఠకులారా! నేను దృఢంగా అనుకునేదేమిటంటే బాబా సాహెబ్‌గారు కూడ శ్రీ సాయిబాబాని కలుసుకోవడానికి నిర్ణయించు కున్నారు. అందుచేత ఈ కాలంలో ఆయన తన స్నేహితులయిన శ్రీ శ్యాంరావ్ జయకర్, శ్రీ కాకాసాహెబ్ దీక్షిత్, జస్టిస్ ధురంధర్‌గారిని కూడ కలుసుకొని వారందరూ కూడ సాయిభక్తులని తెలుసుకున్నారు. ఆఖరికి మా తాతగారు షిరిడీకి ఒక విలాసయాత్రగా, కుటుంబంతో వెళ్ళడానికి అంగీకరించారు. ఆయన చాలా తీరికలేని వ్యక్తి కాబట్టి ఉద్యోగానికి సెలవు పెట్టి వెళ్ళడం కష్టం. అందుచేత, శుక్రవారం నష్టపోకుండా, వారాంతంలో శుక్రవారం రాత్రి తన స్నేహితులతో సహా వెడదామని నిర్ణయించుకున్నారు.

వారు రాత్రికి మన్మాడ్‌కి రైలులో ప్రయాణిస్తున్నారు. మా నాన్నగారు, నాన్నమ్మగారు పక్కలు పరచుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. మగవాళ్ళందరూ పేకాటలో మునిగిపోయారు. రైలు 'నాసిక్' రోడ్ స్టేషన్‌ని వదిలింది.

అప్పుడు తలచుట్టూ తెల్లని గుడ్డ కట్టుకొన్న ఒక ఫకీర్ పెట్టెలో ప్రవేశించారు. అతను మా తాతగారి వద్దకు వచ్చి దక్షిణ అడిగాడు. మా తాతగారు అతనివైపు చూచి ఒక రూపాయి నాణెం తీసి అతనికిచ్చి వెళ్ళిపొమ్మని చెప్పారు. ఫకీర్ తన దృష్టిని ఆ రూపాయి నాణెం మీదికి మళ్ళించారు. ఎందుకంటే ఆ రోజుల్లో ఒక రూపాయి దానం చేయడమంటే అది చాలా పెద్ద మొత్తం. ఇక్కడ నేను పాఠకులకి చెప్పదలచుకున్నది ఏమిటంటే మా తాతగారు 'ఖటావ్ గ్రూప్స్ ఆఫ్ మిల్స్'కి సెక్రటరీ. ఇంకా 1908వ సం॥లో ఆయనకి నెలకి జీతం రూ.2000లు.

ఆయన ఆ ఫకీరుతో 5వ జార్జి బొమ్మతో ముద్రించబడిన ఆ నాణెం అసలయినదనీ, అది 1905 సం॥లో చలామణికి వచ్చిందనీ, అందుచేత దానిని గురించి ఏ రకమయిన భయం అవసరం లేదని చెప్పారు.

తమ పేకాటకి అంతరాయం కలుగుతుండటం వల్ల అతనిని అక్కడ నుంచి వెళ్ళిపొమ్మని చెప్పారు. అప్పుడా ఫకీరు వెళ్ళిపోయాడు. మరునాడు ఉదయం వారు షిరిడీ చేరుకున్నారు మా నాన్నమ్మగారు, నాన్నగారు. తమకు ఆ ప్రదేశం బాగా తెలిసింది కాబట్టి మా తాతగారికి దారి చూపించారు. వారు స్నానాలు చేసి ఫలహారం తీసుకున్నారు. తరువాత పూజాసామగ్రితో ద్వారకామాయిలోనికి ప్రవేశించారు. మా నాన్నగారు, నాన్నమ్మగారు, బాబాకి వంగి నమస్కరించి వారి పాదాలను స్పృశించారు.

బాబా అప్పుడు వారివైపు చూసి ఒక చిరునవ్వు నవ్వి, మా తాతగారి వైపు తిరిగి "మ్హాతర్యా (ముసలివాడా) నా తల్లి, సోదరుడు నిన్ను వేడుకొని, తరువాత నిన్ను ఒప్పించడంతో వారి ప్రోద్భలంతో నువ్వు షిరిడీ రావడానికి అంగీకరించావు. నువ్వు నన్ను గుర్తించావా?" అన్నారు బాబా. మా తాతగారు లేదన్నట్లుగా చెప్పారు. అపుడు బాబా తన చేతిని కఫ్నీ జేబులో పెట్టి ఐదవ జార్జి బొమ్మ ఉన్న ఒక రూపాయి వెండి నాణాన్ని బయటకు తీశారు. దానిని మా తాతగారికి చూపిస్తూ "కనీసం నిన్న రాత్రి నీవు యిచ్చిన నాణాన్నయినా గుర్తిస్తావా?" అన్నారు. ఇప్పుడు మా తాతగారు క్రితం రాత్రి రైలులో జరిగిన సంఘటనని గుర్తుచేసుకోవడం మొదలు పెట్టారు. ఆయన తిరిగి ఏదయినా చెప్పేలోపే ఆయనతో "ఏయ్ రాత్రి నువ్వు చూసిన ఫకీరు నేను తప్ప మరెవరూ కాదు" అన్నారు సాయిబాబా. తాతగారు తక్షణం దుఃఖంలో మునిగిపోయారు. ఆయన తన తప్పు తెలుసుకున్నారు. బాబాని ఒక యాచకుడిగా భావించారు. రాత్రి తాను చేసిన పనికి చాలా విచారించారు. ఆయన బాబా ముందు వంగి క్షమించమని అడిగారు. జ్యోతీంద్ర మరియు తన భార్య బాబాగారి గురించి చెప్పింది నూటికి నూరు శాతము నిజమని ఆయనకి అర్థమయింది. పైగా బాబాగారు సామాన్య వ్యక్తి కాదు; నిజం చెప్పాలంటే ఆయన "భగవంతుని దూత" అనుకున్నారు.





ఈ సంఘటన తరువాత బాబాసాహెబ్ తర్ఖడ్‌గారిలో అపూర్వమైన పరిణామం సంభవించింది. ఆయన ఇక ప్రార్థనా సమాజ్‌వాది కాదు. ఆయన బాబా మీద ఆధ్యాత్మికమైన ప్రేమని పెంపొందించుకున్నారు. బాబాతో చర్చించిన తరువాతే ఆయన ముఖ్యమయిన నిర్ణయాలను తీసుకోవడం మొదలుపెట్టారు. బాబాగారు కఫినీ కుట్టించుకోవడానికి బట్టల తానులు పంపడం మొదలుపెట్టారు.

రాత్రివేళల్లో ద్వారకామాయిలో వెలిగించడానికి పెట్రోమాక్స్‌లైట్లు కూడా పంపించారు. మా నాన్నగారు షిరిడీలో ఉన్నప్పుడల్లా సాయంత్రం వేళల్లో వాటిని వెలిగిస్తూ ఉండేవారు. ద్వారకామాయిలో నిర్ణయించిన ప్రదేశాలలో వేలాడదీస్తూ ఉండేవారు. దీనిని గురించిన ఒక ఆసక్తికరమయిన విషయం ఉంది. దానిని తరువాత వివరిస్తాను.

ప్రియ పాఠకులారా! ఈ రీఇగా తార్ఖడ్ కుటుంబంలోని ముగ్గురికి 'షిరిడీ సాయిబాబా'తో అనుబంధం ఏర్పడింది. నిజానికి ఒక శక్తివంతమైన అయస్కాంతంలాగా బాబా వారిని తమవైపుకు లాక్కున్నారు. వారందరూ కూడ బాబా మీద అమితమైన ప్రేమని పెంపొందించుకున్నారు. వారికి అనుభవాలు కలుగుతున్నాయన్న సామాన్యమైన కారణంతో వారి షిరిడీ దర్శనాలు ఎక్కువయ్యాయి. వారి స్వభావానికి అవి అద్వితీయం. అవి లీలలు తప్ప మరేమీ కావు. అవే వారికి సాయిబాబా భగవంతుని అవతారమని తెలియజేశాయి. నేను మీకు ఈ అనుభవాలన్నిటినీ చెప్పబోతున్నాను. వాటిని చదివిన తరువాత మీరు కూడ నాతో ఏకీభవిస్తారని నాకు తెలుసు.

బాబా ఆ ఒక రూపాయి వెండినాణేన్ని మా తాతగారికి తిరిగి యిచ్చి "ముసలివాడా! నీ నాణేన్ని నీకు తిరిగి యిస్తున్నాను. దీనినే నువ్వు పూజించు. నీ సంకల్పం నీకు ఫలవంతమయిన జీవితాన్నిస్తుంది. నన్ను నమ్మండి. పవిత్రమయిన ద్వారకామాయిలో నేనెప్పడూ అబద్ధం చెప్పను" అన్నారు. ఆ విధంగా బాబా మా తాతగారిని "మ్హాతారాయా" అనీ, మా నాన్నగారిని "భావూ అని సంబోధించి, తరువాత జరిగే అన్ని సంభాషణలలో కూడా అదేవ విధంగా కొనసాగిస్తూ ఉండేవారు.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

మే నెల 17వ తేదీ ఉదయం వనస్థలీపురంలోని విజయపురికాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థానంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఏకాదశ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన విశేష సత్సంగ సమావేశానికి వేంచేసారు. శ్రీ సాయిశక్తి గురించీ, శ్రద్ధా, సహనాలను గూర్చీ, మానవుడు బాబాను దగ్గర చేసుకోవలసిన రీతిని గూర్చీ సవివరంగా ప్రవచించారు. మాతాజీ దేవాలయాలంటూ ఉంటేనే గుడులుంటాయి-అందుచేత హిందువు ఎలా జీవించాలో, హిందూ ధర్మాన్ని ఎలా రక్షించుకోవాలో వారానికొక్కసారైనా చెప్పటం ప్రతి దేవాలయ నిర్వాహకుల బాధ్యత-అలా కానినాడు ఆలయాల ఉనికే సందేహంలో పడుతుంది"-అని వివరించారు. తదుపరి ఆలయం గురుదేవులను సముచితరీతిన సత్కరించుకొన్నది.

19వ తేదీ సాయంత్రం ఆర్.ఎస్.ఎస్. శాఖా నిర్వాహకులకు (ఘట నాయక్ వగైరాలకు) శిక్షణ కోసం ఏర్పాటైన సభలో ముగింపు ఉత్సవంలో గురుదేవులు ఆశీః ప్రసంగం చేసారు.

24వ తేదీ శ్రీమతి కవిత, శ్రీ అనంతరెడ్డిగార్ల పుత్రుడు చి॥ రాజు గోదాన కార్యక్రమం నిర్వహించాడు ఆశ్రమంలో.

జూన్ మూడవ తేదీ ఉదయం ఆరున్నరకు బయలుదేరి బోడుప్పల్ వెళ్లారు. గురుదేవులు అక్కడ వెంకటరెడ్డి నగర్‌లో శ్రీ అమ్మసాని సత్యనారాయణరెడ్డిగారి ఆధ్వర్యంలో నడుస్తున్న శివాలయం ప్రాంగణంలో శ్రీ సాయినాథ దేవాలయ నిర్మాణం జరిగింది. అక్కడ శ్రీ సాయి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ చేయడం కోసం సత్యనారాయణరెడ్డిగారి కోరికపై గురుదేవులక్కడికి విచ్చేసారు. ఉదయం 8 గం. 15 ని.లకు





నామసంకీర్తనతో, వేద మంత్రాలతో యంత్ర స్థాపన, ప్రతిష్ఠ జరిగాయి. తరువాత శ్రీ సాయి భజన, తరువాత సాయినాథుల వారిని గూర్చి, దేవాలయల సంరక్షణను గురించీ, హిందూ ధర్మ రక్షణకై ఆలయా లను రక్షించుకోవటం గురించీ గురుదేవుల ఆనతిపై (వారు మౌనదీక్షలో ఉండటం చేత) మాతాజీ వివరించారు. అటుపైన ఆలయం వారి సన్మానాన్ని స్వీకరించి గురుదేవులు అక్కడి నుండీ నాగోలు బయలుదేరారు.

నాగోలులోని సాయినగర్‌లోని శ్రీ సాయి మందిరంలో సాయినాథ ప్రతిష్ఠ పరమపూజ్య గురుదేవుల కరకమలాల మీదుగానే పదకొండేళ్ల క్రితం జరిగింది. ఆ దేవాలయంలోని విశిష్ట కార్యక్రమానికైనా గురుదేవులను ఆహ్వానించి తీసుకువెడుతుంటారు వారు. ఈ పదకొండవ వార్షికోత్సవానికి కూడా అలాగే రావాలని ప్రార్థించగా గురుదేవులు సమ్మతించారు. ఉదయం 11 గం.లకు అదే ఆలయంలో శ్రీ విజయ గణపతి, శ్రీ దత్తాత్రేయుల విగ్రహాలను ప్రతిష్ఠించటం గురుదేవుల చేతుల మీదుగా జరిగింది. భక్తులు కొద్దిమందే ఉన్నారు గనుక గందరగోళం లేకుండా ప్రశాంతంగా కార్యక్రమం జరిగింది. అటుపైన దత్తాత్రేయ అవతార విశిష్టతను గురించీ, లక్ష్మిని నెత్తికెత్తుకోరాదని స్వామి చెప్పిన విషయం గురించీ, వారు ఎంచుకొన్న ఇరవై నలుగురు గురువులను గూర్చీ, సంస్కార కార్యం గురించీ వివరించి చెప్పారు మాతాజీ. అంతేకాక దేవాలయం సంస్కార కేంద్రం కావాలనీ, కనీసం వారానికొక్కసారి ప్రతి గురువారం సాయంత్రం ఒక్క గంట సత్సంగం కోసం కేటాయించుకోవాలనీ అన్నారు. సత్సంగ మహిమను గురించిన కథను చెప్పి, ఆలయ నిర్వాహకులు కూడా సత్సంగాలకు తోడ్పడాలని కోరారు. ఆలయ నిర్వాహకులు తమ అంగీకారాన్ని తెలియజేశారు. తదుపరి గురుదేవులు ఆలయం వారి సత్కారాన్ని స్వీకరించి, ఆశ్రమానికి మరలి వచ్చారు.

జూన్ నెల 3, 4, 5 తేదీలలో ఆశ్రమానికి మూడు కిలోమీటర్ల దూరంలో అంకిరెడ్డి పల్లె ప్రవేశానికి యివతల ఉన్న చేలలో (హను మద్దేవాలయ నిర్మాణం జరిగిందిటీవలనే) శ్రీ హనుమత్ప్రతిష్ఠా మహోత్సవ పూజలు జరుగుతాయి. గురుదేవులు మౌనదీక్షలో ఉన్నారని తెలిసినప్పటికీ- ఆలయ నిర్మాణానికి ఉత్సాహంగా ముందుకువచ్చిన ఆదర్శ యువజన మండలి సభ్యులు పదేపదే కోరటంతో గురుదేవులు మంగళవారం (నాల్గవ తేదీ)నాటి ఉదయం ఆ దేవాలయానికి విచ్చేసారు. గ్రామీణులు ఎంతో శ్రద్ధాభక్తులతో పూజ కోసం, వారి దర్శనం కోసం అక్కడ కూడారు. గురుదేవులు ఇంకా ప్రతిష్ఠితం కాని గర్భాలయంలో విభూతి చల్లి, హనుమంతునికీ తమకూ ఉన్న అనుబంధంతో ఉద్విగ్నులై, కన్నీటి పర్యంతమైనారు. తదుపరి మాతాజీ హనుమంతుని ఘనతను వివరించారు. కోతిగా పుట్టి, మానవస్థాయిని దాటి, పూజ్యస్థాయికి చేరి దైవమైపోయాడు హనుమ. అంటే మనిషి దేవు(డిగా ఎదగడానికి ఒక్క జన్మ చాలుననీ, దానికి సాధనే అవసరమని నేర్చుకోవాలన్నారు. భక్తీ, శక్తీ, యుక్తీ కలబోసిన మూర్తిగా - మైనాకుని ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరిస్తూనే తన బొటనవేలు ఆనించి ఆయనను మన్నించిన సంస్కారం గురించీ, బ్రహ్మచారి అయిన తాను రావణాసురుని అంతఃపురం చూడవలసి వచ్చినందుకు బాధపడటం, దోషపరిహారార్థం ప్రార్థన చేయటం గురించీ, శక్తి ఒదిగిఉండాలనీ, భక్తితో కలిసినప్పుడే దానికి విలువ ఉంటుందనీ, శక్తీ భక్తీ ఉపయోగించనక్కర లేనిచోట-శత్రువు బలవంతుడైనచోట యుక్తి ఉపయోగించాలనీ హనుమ చూపిన మార్గంలోనే నడిచి మనం మన దేశరక్షణకు నడుంకట్టాలనీ మాతాజీ వివరించారు. అటుపైన స్వామీజీ దేవాలయ కార్యక్రమాల కోసం దక్షిణ యిచ్చి నిర్వాహకులను ఆశీర్వదించారు. వారు చేసిన సత్కారాన్ని స్వీకరించి సభ చాలించారు.







# గురుపూర్ణిమోత్సవం- శ్రీసాయినాథులు ద్వారవతికి వేంచేసిన వేళ

## సాయిధామం-శ్రీ సాయి దత్త పీఠం

ప్రియమిత్రులారా,

ఎఱుక (జ్ఞానం)గలవారు గురువులైతే-మరుపు గలవారు అజ్ఞులైన శిష్యులు. అప్పడప్పడూ ఎండ ముఖం చూపించకపోతే ఏ వస్తువైనా బూజుపడుతుంది. అలాగే మనం కూడా అప్పడప్పడూ గురుదర్శనం చేసుకొని, వారి వాగమృతంతో తమలో పేరుకుపోతున్న విషయ విషాన్ని విరగకొట్టుకోవటం, వారి దృష్టిపాతంతో అజ్ఞానావరణను కాల్చి వేసుకోవటం చాలా అవసరం. అందుచేత మిత్రులారా, జూలై 22వ తేదీ గురుపూర్ణిమ నాడు మనమందరం సాయిధామంలో వెలసిన శ్రీ సాయిబాబా వారిని, శ్రీ దత్తాత్రేయస్వామిని దర్శనం చేసుకొందాం. ద్వారవతిలోకి సాయి, శ్రీ దత్తులు వేంచేసి 17 సంవత్సరాలు పూర్తి అయిన వేళ-వారిని మనసారా అర్చించుకొందాం. అటుపైన మన పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి దర్శన లాభం పొందుదాం. స్వామి వారి మౌన దీక్ష కారణంగా కార్యక్రమం కొంత కుదించబడుతున్నది. వివరాలు దిగువ ఇవ్వబడుతున్నాయి.

| | | |
|---|---|---|
| ఉదయం | 5.15 | మేలుకొలుపు (కాకడ హారతి) |
| | 6.30 | శ్రీ సాయికి పంచామృతాభిషేకం. నారికేళ రసాభిషేకం/ జలాభిషేకం |
| | 8.00 | అర్చన (తులసి, మారేడు దళాలతో) |
| | 9.00 | ఓవర్‌హెడ్ నీటిటేంక్-"అమృత" ప్రారంభోత్సవం,నామకరణం. |
| | 10.00 | సామూహిక సహస్ర నామపూజ-పుష్పాభిషేకంతో |
| | 11.00 | గురుస్తుతి, గురు ప్రశస్తి - ప్రవచనం, గురు వందనం, ఆశీస్సులు |
| | 12.00 | మహా హారతి |
| | 1.00 | అన్నప్రసాద వినియోగం |

ప్రియ మిత్రులారా,

విజయనామ సంవత్సరం, ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు మనమందరం ద్వారవతిలో అభిషేక సమయానికే కలుసుకొందాం. ప్రేమ నిండిన గుండెతో, దోసిట పూలతో రండి.

ఏదైనా సహకారం అందించాలని మీకున్నదా? ఫోన్ నెంబర్లు దిగువ ఉన్నాయి.

**ఫోన్ : 08685-326053, 9440413455, 9848133565**

# మౌనదీక్ష

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు మే నెల 31వ తేదీ నుండి మౌనదీక్ష స్వీకరించారు. అంతకుముందరి సాయంత్రం హఠాత్తుగా ఆశ్రమవాసులు, కొద్దిమంది కార్యకర్తలతో చిన్న సమావేశం ఏర్పరచి యీ విషయాన్ని తెలియజేసారు. అందుచేత ముందుగా అందరికీ తెలియజేయలేకపోయాము. స్వామివారి యీ దీక్ష కనీసం మూడు నెలల పాటు కొనసాగుతుంది. అటుపై భగవదిచ్ఛ! సెప్టెంబరు 5వ తేదీ వరకు స్వామివారి దర్శనం కోసం దయచేసి ఎవ్వరూ తొందరపడి రావద్దని భక్తులందరికీ యిదే మా విన్నపం. ప్రతినెలా పూర్ణిమనాటి ఉదయం తొమ్మిది నుండి పదిగంటల వరకు ఒక్కగంటసేపు మాత్రం వారి దర్శనానికి అవకాశం ఉంటుంది. అది కూడా మౌనంతోనే. ఈ పూర్ణిమ తిథి జూన్ 23, జూలై 22, ఆగస్టు 21 తేదీలలో వస్తుందని గ్రహించగలరు.

స్వామివారి సాధన మనందరి శ్రేయస్సు కొరకే ఉపకరిస్తుంది గనుక మనందరం వారి సాధనకు సహకరించే విధంగా - ఏ విధమైన యిబ్బందీ వారికి కలిగించకుందుముగాక! తథాస్తు!

**విశేషం :** ఈ తిథులలో జూలై 22 గురుపూర్ణిమ అయింది. కనుక ఆ రోజున మాత్రం 11 గం.ల నుండి 12 గం.ల వరకు ఆలయంలో కూడా దర్శనం లభిస్తుంది.







# మంగళాశీస్సులు



కేశవపురం వాస్తవ్యులు శ్రీ వేముల హరినాథరెడ్డిగారు ఆశ్రమం అభిమానులు. వారు తమ కనిష్ఠ పుత్రిక చి॥ మమతకు వైదిక విధితో వివాహక్రతువు నిర్వహించారు. వధూవరులు అన్యోన్యానురాగబద్ధులై, సత్సంతానప్రాప్తితో కలకాలం పచ్చగా జీవించాలని పరమపూజ్య గురుదేవుల ప్రేమాశీస్సులు.

శ్రీ ఉడుత వేంకటేశం (కేశవపురం)గారి పిల్లలు ముగ్గురూ సాయి విద్యాధామం విద్యార్థులుగా పెరిగినవారే. వారిలో పెద్ద కుమారుడు చి॥ సంతోష్‌కుమార్‌కు చి॥సౌ॥ పావనితో 26, మే నాటి రాత్రి 10.54 ని.లకు అంగరంగ వైభవంగా కళ్యాణక్రతువు నిర్వహించారు. వధూవరులు ఎల్లవేళలా అన్నిరీతులా ఒక్కటిగా జీవించి, దేశానికి ఉపకరించగల సత్సంతతిని పొంది, సఫలజీవనులౌదురు గాక - అని పరమపూజ్య గురుదేవుల దివ్యాశీస్సులు.

శ్రీమతి మామిడి ప్రభావతిగారు చిరకాలంగా ఆశ్రమ అభిమాని. మంచి కార్యకర్తగా పనిచేశారు. వారు తమ కనిష్ఠపుత్రుడు చి॥ అజయ్ వివాహక్రతువు చి॥సౌ॥ దివ్యతో 29 (మే) ఉదయం గం.9.22కు వనస్థలిపురంలో ఎం.ఇ.రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఉన్నత విద్యావంతులైన వధూవరులు పరస్పరానురాగంతో కలకాలం జీవించి తమ సంతతిని లోకకళ్యాణకారులుగా తీర్చిదిద్దగలరని పరమపూజ్య గురుదేవుల శుభాశీస్సులు.

# శ్రీ రమణ ఉవాచ



ప్రశ్న : దుఃఖాన్ని పోగొట్టుకునేదెట్లా?

మహర్షి : దుఃఖం బయట లేదు నీ లోపల ఉంది. సూటిగా చెప్పాలంటే అది నీ అహంకార రూపంలో ఉంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అహంకార స్వరూపమే దుఃఖము. అసలు నిన్ను నీవు కొన్ని పరిమితులకు కుదించుకొని, ఆ పరిమితుల్ని అధిగమించటానికై, వేదనాయుతమైన దీర్ఘ జటిల పోరాటం చేస్తావు. అహంకారం వల్లే దుఃఖం వస్తుంది. తన కొక రూపం, నామం ఉన్నదని భావించటమే దుఃఖహేతువు. ఈ రూప నామాల్ని అధిగమిస్తే సర్వత్రా నిండిన ఆత్మవే నీవౌతావు. దుఃఖాన్ని తొలగించటానికి, బాహ్యాముఖమైన నీ దృష్టిని అంతర్ముఖ పరచాలి. ప్రపంచము, బాధలు సత్యం కావు. ప్రపంచంలో ఉండే దుఃఖానికి భగవంతుడు కారణం కాదు. భగవంతుడు పరిశుద్ధుడు. ఆయన ప్రతి చర్యా పరిశుద్ధమైనది. నీవు వాటిని దుఃఖంగా చూస్తున్నావు. అది నీ చూపులో, అహంకారంలో ఉంది. అనంతమైన ఆత్మ నుండి నిన్ను వేరు పరచుకోవటమే దోషం. ఇక్కడే అహంకారం తలెత్తుతుంది.

ప్ర : భక్తుడు అన్నామలై స్వామి భగవానుని మెల్లగా అడిగాడు. "భగవాన్ పూర్వజన్మలో మీరెవరూ? నేనెవరు?

మ :నవ్వుతూ "పూర్వజన్మలోనా? ... వుండు ... వుండు .... ముందు ఈ జన్మని తెలుసుకో! నీకు జన్మ ఉందా? నీవెవరు అన్నది తెలుసుకోవడమే ముఖ్యం. పూర్వజన్మల సంగతీ, అదీ తెలుసుకుంటే ఎన్నో బాధలు కలుగు తాయనే "మరుపు"నిచ్చారు. ఆ మరుపే





లేకుంటే ఎంతో బాధ! ఆ మరుపు యివ్వడం కూడా ఈశ్వరుని కరుణే!"

పూర్వజన్మలో నేను పాపాత్ముణ్ణి అని తెలిసినవాడు "అయ్యో! నేను ఇంత పాపినే" అని క్రుంగి ఇంకా అధఃపతనమవుతాడు. నేను పుణ్యాత్ముణ్ణి అని తెలిసినవాడు అహంకారముతో పతనమవుతాడు. కనుక ఏదీ తెలీకుండా మాయ కప్పడం మన మంచికే! అది ఈశ్వరుని కరుణ మన మీద" అన్నారు.

ప్ర : ఒక రోజున ఏదో మాటల సందర్భంలో భక్తుడు. శ్రీ కుంజుస్వామి "శ్రీ రమణ భగవానులకు దప్ప మరెవ్వరికి సాష్టాంగ నమస్కారము చేయుట నాకు ఇష్టము లేదు" అని శ్రీవారితో అన్నారు.

మ : ఎంత తెలివిగలవాడవు! నీ భగవాన్ ఈ శరీరములో యీ సోఫా మీదేనా ఉంది! ఆయన మరెక్కడా లేడా? ఏ ఒకరైనా ఒక వ్యక్తిని ఆరాధించి భక్తి భావముతో ఉంటే అతడింకెక్కడికి వెళ్ళకూడదు. నీవు ఇంకో ప్రదేశమునకు వెడితే అచ్చటి ప్రజలు ఏమి చేస్తే అది నీవు చేయాలి. ఏ ప్రదేశము నందైనను ఎప్పడైనను నీవు సాష్టాంగ నమస్కారము చేస్తే అప్పడు నీవు నీ గురువునుగాని నీ యిష్టదైవమును తల్చుకోవలెను. ఆ విధముగా నీవు చేస్తే, నీవు పెట్టిన నమస్కారము, నీ మనసులో తలిచిన వారికి చేరును. అది చేయవలసిన సరైన మార్గము.

ఈ ఉపదేశము కుంజుస్వామికి కనువిప్పైనది. అది కుంజుస్వామికే కాదు. అందరికీ వర్తిస్తుంది.





# అసలైన కవిత్వం

ఒక పండు ముదుసలి పడుతూ లేస్తూ నడుస్తున్నది. ఆమె చాలా దూరం నుండి వస్తున్నట్లు ఉన్నది. దారిలో కొందరు నీళ్ల కోసం వచ్చిన స్త్రీలు ఆమెకు కనుపించారు. "ఈ చెలమ కూడా ఎండిపోతున్నది" అని ఒక స్త్రీ అన్నది. "ఈసారి అనావృష్టి అంటే మనందరం ప్రాణాలు పోగొట్టు కోవటమే!" అని ఇంకొక ఆమె అన్నది. బాటసారి ఆ మాటలు విన్నది. వాళ్ల బాధను అర్థం చేసుకున్నది. ఇంకా కొంచెం దూరం వెళ్లింది. పొలంలో ఒక రైతు దీనావస్థలో కూర్చొని ఉ న్నాడు.

అతడు తలపట్టుకొని "పంటలన్నీ పాడైపోయాయి. తిండి కోసం మేము ఏమి చేయాలి?" అని విలపిస్తున్నాడు. ఆ మాటలు విన్న ముసలమ్మ మనస్సు తరుక్కుపోయింది.

ఆమె ఆ రాజ్యం పాలించే రాజుగారి సభకు చేరుకున్నది. అక్కడ 'కవితా గోష్ఠి' జరుగుతున్నది. ఆ ముసలావిడ కూడా కవయిత్రే, ఆమె కవితాగోష్ఠిలో పాల్గొనడానికే వచ్చింది. కాని దారిలో చూచిన ప్రజల కష్టాలే ఆమె మనస్సులో తిరుగాడుతున్నాయి.

అందరూ ఆమెను కవిత చదవమన్నారు. ఆమె సభలో పైకి లేచింది. అందరూ కవిత చదువుతుందనుకున్నారు. కాని ఆమె అలా చెయ్యలేదు. "నేను వినిపిస్తున్న కవిత - అడ్డుకట్టలు నిర్మించు అంతే!" అని అన్నది.

ఆ మాటలకు అక్కడ ఉన్న అందరూ ఆశ్చర్యపోయారు. రాజుకు ఆ మాటల్లో ఏదో అంతరార్థం ఉన్నదనిపించింది. సభ ముగిసిన తరువాత ఆమెను అంతఃపురానికి పిలిపించుకున్నాడు. తన సందేహాన్ని





బయటపెట్టాడు. నీళ్లు లేక ... పంటలు పండక రాజ్యంలోని ప్రజలు పడుతున్న బాధలు ఆమె రాజుకు వివరించింది. అందుకే నదులకు అడ్డుకట్టలు నిర్మించి నీరు నిలువచేయి. ప్రజల యోగక్షేమాలు చూడు" అని హెచ్చరించింది. ఆమె ఆనతి ప్రకారం కావలసినచోటల్లా నీటికి అడ్డుకట్టలు కట్టించాడు. పంటచేలకు నీళ్లు అందాయి. దానితో ప్రజలు సంతోషించారు.

ప్రజల మేలు కోరిన ఆమె తమిళ కవయిత్రీ, మహాభక్తురాలూ ఐన "అవ్వైయార్"



# కర్మలోని రహస్యం

\- స్వామీ వివేకానంద

మన జీవితాలను మనం పరిశీలించుకొన్నట్లైతే - మన విషాదాలన్నిటికీ కారణం ఒక్కటే కన్పిస్తుంది. మనం ఏదో ఒక పని తీసుకుంటాం- మన శక్తి సామర్థ్యాలన్నీ దాని మీదనే పెడతాం - ఒకవేళ అందులో ఓటమి పొందినాగానీ దాన్ని మనం వదిలిపెట్టలేము. మనకు అది దుఃఖాన్నే కలిగిస్తున్నదనీ, యింకా దాన్ని పట్టుకు వ్రేళ్లాడటం వలన మరింత దుఃఖమే కలుగుతుందనీ మనకు తెలిసినప్పటికీ మనం దాని నుంచీ దూరంగా పోలేము. తేనెటీగ తేనె త్రాగటానికి వస్తుంది-తేనె కుండ దగ్గరకు. దాని కాళ్లు ఆ తేనె జిగురులో కూరుకుపోతాయి. అది పాత్రను విడిచి స్వేచ్ఛగా ఎగిరిపోలేదు. మనం మళ్లీ మళ్లీ యిలాటి స్థితిలో పడుతూనే ఉంటాం. మన ఉనికిలోని రహస్యం యిదే. మనం యిక్కడికి ఎందుకు వచ్చాం? తేనె త్రాగడానికి వచ్చాం. మన చేతులూ, కాళ్లూ యీ విషయాలలో

(లౌకిక) అతుక్కుపోయాయి. మనం యిక్కడ చిక్కుకుపోయాము. పట్టుకొందామని వచ్చి పట్టుబడిపోయాము. ఆనందిద్దామని వచ్చాము. కానీ ఏవో మననే పట్టుకొని ఆనందిస్తున్నాయి. పరిపాలిద్దామని వచ్చిన వాళ్లం కాస్తా పాలితులమైపోయాము. కర్మ చేద్దామని వచ్చి, దానికే లొంగిపోయి బద్ధులమవుతాము. ఇది మనకు మన జీవితంలోని ప్రతి కోణంలోనూ కనిపిస్తుంది.

మనం ఎప్పుడూ కూడా యితరుల మెదళ్లపై ఆధారపడి పని చేస్తుంటాం. అలా చేస్తున్నందుకు (పోరాడుతూనే ఉంటాం) యిబ్బందుల నెదుర్కొంటూనే ఉంటాం. మనం ప్రకృతి నుంచీ ప్రతిదీ పొందాలను కొంటాం. కానీ చివరికి ప్రకృతే మన నుండీ ప్రతిదీ లాక్కొని మనను ఓ ప్రక్కకు నెట్టిపడేస్తుంది. బ్రతుకంతా కాంతిమయంగా ఉండదందుకే - ఫరవాలేదు. ఈ విజయాపజయాలన్నింటితోను, యీ ఆనంద విషాదాలన్నింటితోను కలిసి కూడా మన జీవితం తేజస్సుకు ఉత్తరాధికారి కావచ్చు. కానీ, ఒక్కటే షరతు. మనం బంధితులం కాకూడదు.

ఇదే మన దుఃఖాలన్నిటికీ మూలకారణం-మనం ఏర్పరచుకొనే అనుబంధాలు, వాటికి మనం బద్ధులం కావటం. కానీ దానికి అతుక్కుపోకు, బద్ధుడవు కాకు" అని. "అది నీకు ఎంత ప్రియమైనదైనా కానివ్వు, నీ ఆత్మ దానిని ఎంత బలంగానైనా ఆశించనివ్వు, దాన్ని విడిచిపెట్టటం వలన నీకెంత దుఖం కలుగుతుందని నీవు భావించు అదెంతటిదైనా సరే-నీవు అన్నకొన్న వెంటనే, ఎప్పుడు కావాలంటే అప్పుడు-దాన్ని విడిచిపెట్టివెయ్యడానికి కావలసిన శక్తిని మాత్రం నీలో ఉంచుకో. బలహీనుడికి యీ జన్మలోనే కాదు మరో జన్మలో కూడా చోటు ఉండదు. బలహీనతే శారీరక, మానసిక దుఃఖాలన్నిటికీ దారితీస్తుంది. బలహీనతే మృత్యువు.





మన చుట్టూ కోటానుకోట్ల క్రిములుంటాయి. కానీ మనం బలంగా, వాటిని ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉన్నంతసేపూ అవి మనకు ఎలాటి కీడూ చేయలేవు. మనం బలహీనులమైతే మాత్రం వాటిదే జయం. అలాగే మన చుట్టూ లక్షలాది దుఃఖకీటకాలు చెలరేగుతుండనీ గాక- ఏం ఫర్వాలేదు- మన మనసు బలహీనపడనంతవరకు అవి మననేమీ చెయ్యలేవు. ఇది గొప్ప సత్యం. బలహీనతే ఎడతెగని వేదన, మరణం- బలసంపన్నతే జీవనం.

ప్రస్తుతం మన ఆనందాలన్నిటికీ మూలం బంధమే. మన స్నేహితులు, బంధువులు, మన మేధస్సు, ఆధ్యాత్మిక కార్యాలు-మొత్తం మీద మనం లౌకిక వస్తువుల ద్వారానే ఆనందం పొందాలన్న భావనతో ఉన్నాం-అందుకే వాటితో బంధం పెంచుకొంటున్నాం. మరి అదే అనుబంధం మనకు దుఃఖం కలిగిస్తున్నపుడు ఏం చెయ్యాలి? ఆనందప్రాప్తి కోసం యీ బంధాన్ని వదిలెయ్యాలి. మనం ఇచ్ఛానుసారంగా యీ బంధం వదలగలిగే శక్తిని సంతరించుకోగలిగితే దుఃఖం ఉండదు. ఏదైనా ఒక దానితో ఎంతగా అనుబంధం పెంచుకొంటాడో అంతగానూ తెంచుకోగల మానవుడే అత్యంత సహజశక్తి సంపన్నుడవుతాడు. కొందరు వ్యక్తులు అసలుదేని పట్లా ఆకర్షింపబడరు. వారు దేనినీ, ఎవ్వరినీ ప్రేమించనే లేరు. వారు పాషాణహృదయులు. కనుక జీవితంలో దుఃఖాలుండవు. కానీ ఒక గోడ ఉందనుకొందాం. అది దేన్నీ ప్రేమించలేదు-దుఃఖించనూ లేదు. కానీ, అది కేవలం గోడ మాత్రమే. గోడగా బ్రతకటం కన్నా బంధాలకు లోనవటమే నయం. దేనినీ ప్రేమించలేనివాడు ఓ బండరాతిలాగా ఏ దుఃఖాన్నీ పొందడు. అంతటితో పోదు. అతడు సహజ జీవనపు ఆనందాలు కూడా కోల్పోతాడు. మనం అలా కాకూడదు. అది బలహీనత, మరణం. అది మనకు వద్దు. ప్రేమిద్దాం-పనిచేద్దాం. అవసరమైననాడు వదిలేద్దాం.